ఘనంగా నవగ్రహ ప్రతిష్ఠ పూజలు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 22: మున్సిపాలిటీ తట్టిఅన్నారం పరిధి హనుమాన్ నగర్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయంలో నవగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. గణపతి పూజ, యాగశాల ప్రవేశం, వాస్తు నవగ్రహ హిత సర్వతోభద్ర మండప పూజలు నిర్వహించారు. శుక్ర, శనివారాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీతారామ ఆంజనేయ స్వామి ఆలయ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

మంచాల, ఫిబ్రవరి 22 : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని మాజీ సర్పంచ్ కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఆరుట్ల గ్రామంలో వేణుగోపాల స్వామి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య, రావుల భాషా, మార సురేశ్, రమణారెడ్డి, భాస్కర్, నాగరాజు, శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

నందిగామ, ఫిబ్రవరి 22 : నందిగామ మండల కేంద్రంలోని వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో వీర బ్రహ్మేంద్ర స్వామి కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు నందిగామ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దేపల్లి కుమారస్వామిగౌడ్, నాయకులు గోపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నర్సింహ, రాఘవేందర్‌చారి, శివకుమార్‌గౌడ్, అంతయ్య, జగయ్య, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కందుకూరు, ఫిబ్రవరి 22 : మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో చీకటి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి ప్రారంభం కానున్నాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు.

సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి
- మున్సిపల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం

మున్సిపాలిటీ ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 22 : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సమస్యల పరిష్కారానికి శ్రద్ధ చూపాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని, దానిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో పారిశుధ్యం కోసం ప్రత్యేక స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని, మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తయారు చేయాలని అన్నారు. పారిశుధ్య సిబ్బంది కొరత ఉంటే నెల రోజుల కోసం తాత్కాలికంగా సిబ్బందిని నియమించుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపాలిటీకి రోజుకు వచ్చే 40 లక్షల లీటర్లకు అదనంగా మరో 30 లక్షల లీటర్లను అందించే విధంగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ట్యాక్స్‌లు చెల్లించకుండా బకాయిపడ్డ వారందరి నుంచి ట్యాక్స్‌లు వసూళ్లు చేసి మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచాలని ఆయన సూచించారు. విద్యార్థులు డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని పలువురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇబ్రహీంపట్నంలో ఉన్న ప్రతి హాస్టల్, ప్రతి విద్యాసంస్థలపైన పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి డ్రగ్స్‌తో పాటు ఇతర నిషేదిత మత్తు పదార్థాలను విద్యార్థుల దరిదాపుల్లోకి రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

రూ.13కోట్ల బడ్జెట్‌కు సమావేశం ఆమోదం

మున్సిపాలిటీ పరిధిలో 2024-25సంవత్సరానికి రూ.13.10 కోట్ల బడ్జెట్‌కు మున్సిపల్ ప్రత్యేక సమావేశం ఆమోదించింది. మున్సిపల్ ఆదాయం పెంచటంతో పాటు కొత్తగా విస్తరిస్తున్న కాలనీల్లో సౌకర్యాలు కల్పించటంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, ఏసీపీ పీవీరాజు, తహసీల్దార్ సునిత, సీడీపీవో శాంతిశ్రీ, మిషన్‌భగీరథ అధికారి ప్రియాంక, ఆర్‌అండ్‌బీ డీఈ వేణుగోపాల్ రెడ్డి, ఆర్టీసీ డీఎం వెంకటనర్సప్ప, మిషన్‌భగీరథ డీఈ యాదయ్య, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలి

తల్లిదండ్రులను ఆరాధిస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 22: ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవించాలని సంత్ శ్రీ ఆశారామ్ జీ ఆశ్రమ మేనేజర్ శరత్‌చంద్ర అన్నారు. పట్టణంలోని ఠాగూర్ పాఠశాల ఆడిటోరియంలో గురువారం సంత్ శ్రీ ఆశారామ్ జీ ఆశ్రమం ఆధ్వర్యంలో తల్లిదండ్రుల ఆరాధన దినోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులను భక్తితో ఆరాధించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను మించిన దైశం లేదని, విద్యార్థులు ఎంత ఉన్నతస్థాయికి ఎదిగిన తమ తల్లిదండ్రులను మరిచిపోవద్దన్నారు. ఏ స్వార్థం లేకుండా పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసేది తల్లిదండ్రులని, వారికి సేవ చేయడం ఎంతో అదృష్టంగా భావించాలన్నారు. పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి మన సంస్కృతిని మరిచిపోతున్నామన్నారు. మన సంస్కృతిని మనం గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులు తమ తల్లిదండ్రులను పూజించారు. కార్యక్రమంలో డాక్టర్ అమర్నాత్ సభ్యులు పరమేశ్వర్, నవీన్, దిశ, మమత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలకు నిధులు

కప్పాడులో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కృపేశ్ తదితరులు

ఇబ్రహీంపట్నంరూరల్, ఫిబ్రవరి 22 : బీఆర్ఎస్ పాలనలోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం నిధులు పెద్ద ఎత్తున వచ్చాయని ఎంపీపీ కృపేశ్ అన్నారు. కప్పాడు గ్రామంలో గురువారం రూ.10 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు పనులను జడ్పీటీసీ భూపతిగల్ల మహిపాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలకు నిధులు కేటాయించటం లేదని తెలిపారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హంసమ్మ, బీఆర్ఎస్ నాయకులు మునీర్, స్పెషల్ ఆఫీసర్ వరప్రసాద్ రెడ్డి, ఏఈ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

25 నుంచి జిల్లా స్థాయి క్రీడాపోటీలు

స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించి వివరాలు వెల్లడిస్తున్న జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 22: గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్ఆర్ స్టేడియంలో క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 30 ఏండ్ల క్రితం దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి పేరుపై షాబాద్‌లో రూ.50 లక్షలతో మినీస్టేడియం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి రాజేందర్‌రెడ్డి స్మారకార్థం జిల్లా స్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రికెట్ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ. 75 వేల నగదు, షీల్డ్, వాలీబాల్‌లో మొదటి బహుమతి రూ. 25 వేలు, ద్వితీయ బహుమతి రూ. 15 వేలు అందించనునట్లు చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. పూర్తి వివరాలకు 9849711579/9949086569/9849111018 నంబర్లకు సంప్రదించాలన్నారు. 24వ తేదీలోగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. క్రీడాకారులకు భోజన సదుపాయం కూడా కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ జడల రాజేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకట్‌యాదవ్, నిర్వాహకులు మహేశ్‌యాదవ్, రమేశ్‌యాదవ్, ధనుంజయ్, బీఆర్ఎస్ నాయకులు మంగళి సత్యం, చిల్కమర్రి రాంచందర్ తదితరులున్నారు.

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ తప్పనిసరి

మంచాల, ఫిబ్రవరి 22: పీఎం కిసాన్ పథకం ఆర్థిక సాయం కోసం ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జ్యోతిశ్రీ అన్నారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం లబ్ధి పొందుతున్న వారిలో 139 మంది రైతులు ఈకేవైసీ, 500 మంది రైతులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్‌లింక్ చేసుకోలేదని చెప్పారు. వారంలోపు ఈకేవైసీ, ఆధార్‌లింక్ చేసుకోని వారు మీసే కేంద్రానికి వెళ్లి బయోమెట్రిక్, ఓటీపీ ద్వారా నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

వృత్తి ధర్మాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలి

విధుల్లో చేరుతూ పత్రాలను కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జయశ్రీకి అందజేస్తున్న నర్సింగ్ అఫీసర్లు, పక్కన డాక్టర్ మంజులాదేవి, సునీత

ఆమనగల్లు, ఫిబ్రవరి 22: వృత్తి ధర్మాన్ని అంకితభావం, చిత్తశుద్ధితో నిర్వహించాలని ఆమనగల్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జయశ్రీ, డాక్టర్ మంజులాదేవి అన్నారు. ఇటీవల ఆమనగల్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు నూతనంగా 14మంది నర్సింగ్ ఆఫీసర్లను నియమించారు. వీరిలో ఆరుగురు గురువారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ సునీత, విధుల్లో చేరిన నర్సింగ్ అఫీసర్లు గాయత్రి, భూలక్ష్మి, సాయిలక్ష్మి, రేణుక, అనూష, జ్యోతీమేరి ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 22 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ అన్నారు. హైదరాబాద్ -శ్రీశైలం ప్రధాన రహదారి డివైడర్‌పై ఏర్పాటు చేసిన పూల మొక్కలను గురువారం మున్సిపల్ సిబ్బందితో కలిసి మొక్కలకు నీరు పోశారు. భవిష్యత్ తరాల మనుగడకు చెట్లు ఎంతో అవసరమని అన్నారు.

ఎంపీకి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేత

ఎంపీ రాములుకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కడ్తాల్, ఫిబ్రవరి 22 : తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో వెలసిన వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మార్చి 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ మేరకు హైదరాబాద్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు పోతుగంటి రాములుకు గురువారం మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి ఆలయ ధర్మకర్త శ్రీనివాస్‌మూర్తి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.

భౌతిక దాడులతో ఉద్యమాలను ఆపలేరు

ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్, ఫిబ్రవరి 22 : భౌతిక దాడులతో ఉద్యమాలను ఏబీవీపీ ఆపలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చరణ్ అన్నారు. జేఎన్‌టీయూలో ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడిని నిరసిస్తూ గురువారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధానపరంగా ఎదుర్కోలేక భౌతికదాడులకు దిగడం సరికాదన్నారు. చిత్తశుద్ధి ఉంటే విద్యార్థుల సమస్యలపై పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, శ్రీకాంత్, సమంత్, తరంగ్, వేణు, లక్ష్మణ్ తదితరులున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

కడ్తాల్, ఫిబ్రవరి 22 : మండల పరిధిలోని బాలాజీనగర్ తండాలో శివనాయక్ ఆధ్వర్యంలో చేపట్టిన రామలింగేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం స్థానిక నాయకులు కలిసి భూమిపూజ నిర్వహించారు. గ్రామంలో ఆలయ నిర్మాణాన్ని చేపట్టిన శివను పలువురు అభినందించారు. కార్యక్రమంలో నేనావత్ శివనాయక్, బీచ్చాబావోజీ, కిరణ్‌బావోజీ, రవికుమార్, బీచ్చా, సక్రు, రాజు, జైపాల్, కృష్ణ, పాండు, రఘు, నరేశ్, గోపాల్, తార్యా, శ్రీను, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 22 : పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను అమలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారధి, ఎంపీడీవో బన్సీలాల్, జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో సీసీరోడ్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకుసాగుతామన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని, అందరి ఐక్యతతోనే గ్రామాలు ఎంతో అభివృద్ధిని సాధిస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజు, మాజీ ఎంపీటీసీ లింగం, మాలీ, రపూ, రంజిత్, జగన్, వెంకటేశ్, సాయి, వెంకటేశ్‌గుప్త, రవికుమార్, శేఖర్, టింకు, సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

పిల్లల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కందుకూరు, ఫిబ్రవరి 22 : పిల్లల రక్షణ అందరి బాధ్యత అని బాల రక్ష భవన్ కో-ఆర్డినేటరర్ హర్షవర్ధిని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల ప్రభుత్వ పాఠశాలలో బాలల హక్కులు.. సమస్యలపై రంగారెడ్డి జిల్లా బాలల పరిరక్షణ విభాగం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేస్తే నేరమని పేర్కొన్నారు. బాల కార్మికులు మత్తుకు బానిసలు కాకుండా చూడాలని కోరారు. మత్తును అరికట్టాల్సిన అవసరం ఎంతైన ఉందని ఆ బాధ్యత ప్రతి క్కరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో రంగారెడి జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కో-ఆర్డినేటర్ శేఖర్, అంగన్‌వాడీ సూపర్‌వేజర్ సబిత, కేజీబీవీ టీచర్ మంజుల, ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం

యాచారం: స్వామి వారి కల్యాణ మహోత్సవం

యాచారం, ఫిబ్రవరి 22 : మండలంలోని తమ్మలోని గూడ గేటు సమీపంలో కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి గుట్టపై శ్రీగోదాదేవి పద్మవతీ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం గురువారం కనుల పండువగా జరిగింది. మూలవిరాట్ విగ్రహానికి అభిషేకం, అంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కల్యాణం జరిగింది. వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం సతీసమేతంగా స్వామివారి ఉత్సవ మూర్తులను అంగరంగ వైభవంగా ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. స్వామి పల్లకి మోసేందుకు భక్తులు పోటీ పడ్డారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం

పెద్దఅంబర్‌పేట : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామంలో భూనీలా సమేత వేంకటేశ్వర స్వామి 13వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఎంపీటీసీ భీమగోని భాస్కర్‌గౌడ్, మాజీ సర్పంచ్ ముద్దం స్వరూపా వీరస్వామియాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ సంపత్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చెలిమండ్ల గోవర్ధన్, శ్రీనివాస్, పోచయ్య, వెంకటేశ్, రాజు, బ్రహ్మచారి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిషర్ కమిటీ మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్

నియామాక పత్రాన్ని అందుకుంటున్న బద్రి శ్రీకాంత్

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 22: ఫిషర్ కమిటీ మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్‌ను నియమించారు. గురువారం కమిటీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మన్నె వెంకటేశ్ ఆధ్వర్యంలో శ్రీకాంత్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. మండలంలోని ముదిరాజ్‌ల అభ్యున్నతికి పాటుపడుతానని అన్నారు. కమిటీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఎంతో నమ్మకంతో ఈ పదవీ బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సార మాణిక్యం, తెలుగు శ్రీనివాస్, కావలి రమేశ్, కావలి వెంకటేశ్, మన్నె రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెంటతండాలో మూడు ఇండ్లల్లో చోరీ

ఆమనగల్లు, ఫిబ్రవరి 22: కడ్తాల్ మండలంలోని గోవిందాయిపల్లి తండాల్లో రెండు రోజుల క్రితం ఐదు ఇండ్లల్లో దొంగతనం జరిగిన ఘటన మరువకముందే అదే తరహాలో ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పెంటతండాలో బుధవారం రాత్రి మూడు ఇండ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరికి పాల్పడ్డారు. తాళాలు పగులగొట్టి ఇండ్లల్లోకి చొరబడి బంగారు, వెండి, వస్తువులను దొంగిలించారు. ఎస్సై బలరాం తెలిపిన వివరాలు.. ఇస్లావత్ రఘురామ్ హైదరాబాద్‌కు వెళ్లడంతో ఆయన భార్య సునీత ఇంటికి తాళం వేసి పక్క ఇంట్లో పడుకున్నది. సునీత ఉదయం ఇంటికి వెళ్లే సరికి ఇంటి తాళం పగులకొట్టి బంగారు, వెండి వస్తువులు దోచుకెళ్లినట్లు గుర్తించింది. జఠావత్ మల్యా, ఇస్లావత్ వాల్య ఇండ్లకు ఉన్న తాళాలను పగులకొట్టి బంగారం, వెండి, నగదును ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఎస్సై బలరాం తండాను సందర్శించి చోరి జరిగిన ఇండ్లను పరిశీలించి వివరాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త కుప్పలు ఉండొద్దు

పారిశుధ్య సిబ్బందితో సమావేశంలో డీసీ వంశీకృష్ణ

మియాపూర్, ఫిబ్రవరి 22 : పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపర్చేలా సిబ్బంది కృషి చేయాలని చందానగర్ డీసీ వంశీకృష్ణ అన్నారు. వీధుల్లో ఎక్కడా చెత్త కుప్పలు పేరుకుపోకుండా చూడాలన్నారు. సర్కిల్ పరిధిలోని పారిశుధ్య పరిస్థితిపై ఎస్ఎఫ్ఏలు, ఎస్ఆర్‌పీలతో గురువారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఇప్పటికే సర్కిల్ పరిధిలో 90కిపైగా చెత్త వేసే ప్రాంతాల నుంచి 59కి నివారించగలిగామన్నారు. దశలవారీగా వాటిని పూర్తిస్థాయిలో ఎత్తివేయాలన్నారు. చెత్తను వేసే ప్రాంతాలను గుర్తించి స్థానికులకు అవగాహన కల్పించాలని డీసీ వంశీకృష్ణ తెలిపారు. స్వచ్ఛ ఆటోలు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలని, వాటి పనితీరుపై తగు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. పారిశుధ్య విధుల్లో నిర్లక్ష్యం వద్దని, సిబ్బంది ప్రతిరోజు సకాలంలో విధులకు హాజరుకావాలని, వారి హాజరు విషయంలో ఎటువంటి అవకతవలకు పాల్పడ్డా కఠిన చర్యలు తప్పవని డీసీ హెచ్చరించారు. ఈ సమావేశంలో డాక్టర్ కార్తీక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.